# రౌడీ వెధవ

బదరి

సాయంకాలం అయిదయ్యింది.

చేస్తున్న పని ఆపి తలెత్తి చూసాడు రఫీ.

దాదాపు ఆఫీసులో అందరూ ఫైల్స్ కట్టేస్తున్నారు వెళ్ళిపోవడానికి. ఎవరో కొందరు బుద్ధిమంతులు తప్ప.

తనూ లేచి చక చకా ఫైల్సన్నీ సర్దేసి నెమ్మదిగా లేచి బయటకి నడిచాడు రఫీ ఓవర్ డ్యూటీ చెయ్యడం అలవాటు లేక.

"ఏంగురూ కొత్తగా మేరేజి అయ్యిందన్నావు పార్టీ మాటేమిటి" ప్రక్క సీటులో స్నేహితుడు గుణసాము.

చిన్నగా నవ్వాడు రఫీ సమాధానంగా.

నెమ్మదిగా బయటికి నడిచాడు రఫీ.

ఆఫీసు ఎదురుగా వున్న బస్‌స్టాండులో అప్పటికే జనం క్యూలో నిలబడ్డారు

వేగంగా నడిచి క్యూలో నిలబడ్డాడు రఫీ బస్ పతి నిబంధన పాటిస్తూ.

ఎండ ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. చురుక్కుమంటుంది

దూరంగా ఏదో బస్ వస్తోంది.

ఆనందంగా చూసాడు రఫీ.

బస్సాగలేదు చాలా ఫుల్‌గా వుండడం వలన

నిరుత్సాహం ఆవరించింది రఫీని.

దాదాపు అయిదు నిముషాలు గడిచాయి.

ఈ సారి ఖాళీగానే వచ్చింది బస్సు. ఎక్కి, లేడీస్ సీట్ వెనక కూర్చున్నాడు రఫీ

"టికెట్ ప్లీజ్" కండక్టర్ వచ్చాడు.

"నాంపల్లి" జేబులోంచి అర్థ రూపాయి తీసి అందించాడు రఫీ కండక్టర్‌కి.

కండక్టర్ అందించిన టికెట్ జేబులో వేసుకున్న తన ముందు ఎవరు కూర్చున్నారో చూసాడు రఫీ

ఎవరో యువతి పరదాలో వుంది

కూర్చున్న పొజిషన్ బట్టి పరదాలోంచి కనిపిస్తున్న ఆకారాన్ని బట్టి అందగత్తె అయివుండాలనుకున్నాడు రఫీ

బస్ వేగంగా దూసుకుపోతోంది.

మెల్లిగా తన ప్రక్క వ్యక్తి అనుమానపడకుండా చేయి ముందుకు చాచాడు.

కూర్చున్న కుషన్‌కి, వెనక ఆనుకునేందుకు వున్న కుషన్‌కి మధ్య ఖాళీలోంచి ముందరి సీట్లో యువతి ముసుగు కనపడుతోంది నల్లగా.

చేతితో ఆ ముసుగుని పట్టుకొని మెల్లగా లాగాడు రఫీ.

ఆ అమ్మాయి ఉలిక్కిపడింది. అయినా వెనక్కి తిరగలేదు భయం వలన.

ఉత్సాహం వచ్చింది రఫీకి.

ఇంకొంచెం గట్టిగా లాగాడు రఫీ.

వెనక్కి తిరగలేదామ్మాయి.

చేతులు తీసి ఎదుటి సీటు మీద వేసి చేతి వ్రేళ్ళతో మెల్లగా ఎవరికీ కనపడకుండా తలమీద ముసుగు తీశాడు రఫీ.

అయినా వెనక్కి తిరగలేదా అమ్మాయి

వెనక్కి తిరిగితే బాగుండును అనుకున్నాడు రఫీ.

# "సిగ్గేస్తోంది నాకు"

నేను వ్రాసేది ప్రణయగీతం కాదు
నేను వ్రాసేది ప్రళయగీతం కాదు
నేను వ్రాసేది నిత్యం
కళ్ళముందు జరుగుతున్న సత్యం
నీకు నచ్చదు నా తత్వం
నీలో లేదు సమానత్వం.
కష్టించి పనిచేసే కర్షకునికి
కుతంత్రాలు లేని కూలి నాలి జనానికీ
బోధిస్తున్న ప్రబోధం ఇది
వారి శుభోదయానికి నాంది
అందుకే వ్రాస్తాను ఇలాటి కవితలు

తనయుడేదో చదివి సాధిస్తాడని
తట్టమోసిన తలిదండ్రుల
ఆశాసౌధాలను
పేక మేడల్లా కూల్చిన
ఈ నిరుద్యోగ సమస్య
నిన్ను వేధించటంలేదా?

కడుపాకలి తీరక
కన్న బిడ్డను
పడుపు వృత్తిలో దించిన
కన్నతల్లి పడే క్షోభ
నిన్నేమాత్రం కదిలించటంలేదా?

చెల్లెలు పెళ్ళి చేసిన బాకీ తీర్చలేక
ఉద్యోగం దొరకని అన్నయ్య
అవసాన దశలో ఉన్న అయ్య
బువ్వ వండలేని స్థితిలోఉన్న అవ్వ
ఇల్లమ్ముకొని
పరాధీనులయినప్పుడు
బాధగా నీ మనసు మూల్గదా?

నెలలు నిండిన చూలాలు
ప్రక్కింటి పార్వతమ్మ గారింటికి
పాచిపనికి
వెళ్ళందే పొట్టజరగదని
నీకు తెలియదా?

అయిదేళ్ళు నిండని కొడుకు
అప్పుడే పెదకాపువారి
చేను కాపుకుంచి
పాపం, పసివానికి
లోకమంటే తెలియకుండా
చేసేవారి స్థితిగురించి తెలియదా?

నీకివన్నీ తెలిసికూడా
నీలో చలనం రాకపోతే
నీవుకాపు మనిషివి
జడపదార్థానివి
ఇంతకన్నా నిన్నేమనాలో అర్థంకాక
నీవు నా సహజీవివని చెప్పుకొనుటకు
సిగ్గేస్తోంది నాకు

—ఎమ్. రామచంద్రరావు

---

బస్సు వేగానికి గాలివచ్చి మొహానికి కొట్టుకుంటోంది వెప్పగా. ఒక బస్‌స్టాప్‌లో స్నేహితుడు కనబడి రఫీని తన యింటికి లాక్కుపోయాడు.

• • •

ఆ రాత్రి ఎనిమిది గంటలకి రఫీ ఇంటి తలుపు తట్టగానే తలుపుతెరచి రఫీని చూసి అంది, రఫీ భార్య -

"ఇందాక నేను సికిందరాబాద్ వెళ్ళి బస్సులో వస్తూంటే ఎవడో 'రౌడీ వెధవ' వచ్చి పనులెన్నో చేసాడు బుద్ధిలేడు వెధవ పడి"

★